వైరల్ జ్వరాలతో.. విలవిల



వైరల్ జ్వరంతో బాధపడుతున్న చించోలి(బి) గ్రామస్తులు

చించోలి(బి)లో వైరల్ జ్వరంతో మృతి చెందిన అల్మాస్

- జిల్లాలో వైరల్ జ్వరాలకు తోడు చికెన్ గున్యా
- కిక్కిరిసిపోతున్న వైద్య కేంద్రాలు
- ఉచితవైద్యం అందక రోగుల ఆందోళన
- 'ప్రయివేటు'కు పరుగులు పెడుతున్న వైనం
- ఆర్థికంగా కుంగదీస్తున్న డెంగ్యూ
- వ్యాధులతో విలవిలలాడుతున్న ప్రజలు

సారంగాపూర్, ఆగస్టు 30 : జిల్లాలోని ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఆయా గ్రామాల్లో వైరల్ జ్వరాలకు తోడు చికెన్ గున్యా, డెంగ్యూ జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. ఆయా వ్యాధుల బారిన ప్రజలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు. వివిధ గ్రామాల్లో వైరల్ జ్వరాలు తీవ్రతరం కావడం వ్యాధి సోకినవారు వారం పది రోజుల పాటు మంచానికే పరిమితం అవుతున్నారు. మరోవైపు దోమల బెడద కారణంగా చికెన్ గున్యా, డెంగ్యూ జ్వరాలు ప్రబలుతున్నాయి. చికెన్‌గున్యా సోకిన వారు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. దీని బారిన పడిన వారు కోలుకోవడానికి పక్షం రోజులు పడుతోందని చెప్పుతున్నారు. మరోవైపు డెంగ్యూ జ్వరాలు సైతం ప్రజలను కుంగదీస్తున్నాయి. డెంగ్యూ సోకినవారిలో ప్లేట్‌లెట్స్ పడిపోయి ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. తద్వారా తాము ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నామని బాధితులు వాపోతున్నారు. ఆయా జ్వరాల బారిన పడ్డవారు తొలుత గ్రామాల్లో ఆర్‌ఎంపీ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ఆర్‌ఎంపీల చికిత్స కేంద్రాలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఆయా రోగాలు ఆర్‌ఎంపీల చికిత్సతో తగ్గుముఖం పట్టనివారు నిర్మల్, భైంసా పట్టణాల్లోని ప్రైవేట్ ఆసుపత్రులని ఆశ్రయిస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల బిల్లులు తడిసి మోపెడుకావడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. ఒకవైపు గ్రామాల్లో వ్యవసాయ పనులు కొనసాగుతుండడం, మరోవైపు జ్వరాలు విజృంభిస్తుండడం వల్ల వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదని పేర్కొంటున్నారు. కాగా ఢయేరియా సైతం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రభుత్వ వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ జ్వరాలు తగ్గుముఖం పట్టడం లేదు. జ్వరంతో ఇటీవల చించోలి(బి) గ్రామానికి చెందిన వ్యక్తి మృత్యువాత పడడం గమనార్హం. ఫలితంగా జ్వరం సోకితే తేలికగా తీసుకోకూడదని సరైన వైద్యం తీసుకోవాలని పేర్కొంటున్నారు.



వైరల్ జ్వరాలతో విలవిలలాడుతున్న చించోలి(బి) గ్రామం

డెంగ్యూ వ్యాధితో మృతి

చించోలి(బి)లో అల్మాస్ అనే యువకుడు గత నాలుగు రోజుల క్రితం వైరల్ జ్వరం రావడంతో నిర్మల్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి తిరిగి వచ్చిన సమయంలో అస్వస్థతకు గురికావడంతో చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు దీంతో వైరల్ జ్వరాలు రావడానికి గ్రామాల్లో పారిశుద్ధ్యమే కారణమని గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

అప్రమత్తంగా ఉన్నాం



వాతావరణ మార్పులు, దోమల కారణంగా వైరల్ జ్వరాలు వ్యాపిస్తున్నాయి. తమ వైద్య సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ వైద్యసేవలు అందిస్తున్నాం. జ్వరాలు తగ్గుముఖం పట్టాయి. రోగులకు రక్త పరీక్షలు నిర్వహిస్తూ వ్యాధి నిర్ధారణ చేస్తూ చికిత్సలు అందిస్తున్నాం. చించోలి(బి) గ్రామంలో 40 మందికి వైరల్ జ్వర పరీక్షలు నిర్వహించాం. ప్రజలు ఆందోళనకు గురికావద్దు. వైద్య సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తూ వైద్య సేవలు అందిస్తున్నారు.

డీఎం అండ్ హెచ్‌వో, రాజేందర్



ముగిసిన తాళ సప్తాహ వేడుకలు



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

తానూర్, ఆగస్టు 30 : మండల కేంద్రంలోని శ్రీ విఠలేశ్వర ఆలయంలో గత వారం రోజులుగా కొనసాగుతున్న తాళ సప్తాహ వేడుకలు శుక్రవారం ఘనంగా ముగిసాయి. ఉదయం కాకడహారతి ఘనంగా నిర్వహించారు. అనంతరం భాజాభజంత్రీలతో ప్రజలు శోభాయాత్రగా గ్రామంలోని పోచమ్మ, మహాలక్ష్మీ, హనుమాన్ ఆలయాలను వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో తాళసప్తాహ వేడుకలను నిర్వహించడం ఆనవాయితీ అని అర్చకులు సచిన్‌పాఠక్ తెలిపారు. పండరి పురంలో జరిగే సంస్కృతి సంప్రదాయాలు ఆధ్యాత్మిక పద్ధతిలో ఈ ఆలయంలో కూడా నిర్వహించడం జరుగుతుందని, ఈ ఆలయానికి ఇదే ప్రత్యేక గుర్తింపు అని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పంగి పండరి, ఉప అధ్యక్షుడు డి. రాములు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, గ్రామస్థులు తదితరులున్నారు.

బీజేపీ సభ్యత్వ

కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



లక్ష్మణచాందలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

లక్ష్మణచాంద, ఆగస్టు 30 : బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ శుక్రవారం అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పొలాస గోవర్ధన్ అధ్యక్షతన మండల కేంద్రంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టి ప్రతి పోలింగ్ బూత్‌లో 200ల మందికి తగ్గకుండా సభ్యులను చేర్పాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలను స్వచ్ఛందంగా బీజేపీలో చేర్పించాలని, సభ్యత్వంతోనే పార్టీ మనుగడ సాధిస్తుందన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీగా అవతరించిన బీజేపీని అన్ని వర్గాల ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. మహిళలు సైతం ముందుకు రావడం జరుగుతుందని, లక్ష్మణచాంద మండలంలో బీజేపీకి సభ్యులను పెద్ద సంఖ్యలో చేర్పించి రానున్న స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లో 90 శాతం బీజేపీ అభ్యర్థులు గెలిచే విధంగా కృషి చేయాలన్నారు. ఇప్పటి నుంచి పార్టీని గ్రామ స్థాయి నుంచి పటిష్టం చేసి కాంగ్రెస్ పార్టీకి ధీటుగా, ప్రత్యామ్నాయ శక్తిగా తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు అయిండ్ల భూపాల్ రెడ్డి, అడ్వాల రమేష్, అల్లూరి రాజు, చంద్రమోహన్‌రెడ్డి, రంజిత్, ముత్యంరెడ్డి, జీవన్‌రెడ్డి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని

నాగనాయిపేట్‌కాలనీ వాసుల వినతి



మున్సిపల్ చైర్మన్, కమిషనర్లకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నిర్మల్ టౌన్, ఆగస్టు 30 : నిర్మల్ పట్టణంలోని బంగల్‌పేట్ సమీపంలో గల నాగనాయిపేట్‌కాలనీ వాసులు సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్‌లకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం కాలనీ వాసులు మాట్లాడుతూ... నాగనాయిపేట్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు చెత్త బండి రావం లేదని, రోడ్లన్నీ గుంతలమయంగా తయారై నీరు నిలిచి దోమలకు నిలయంగా మారింది. గుంతలలో మొరం మట్టిని పోయించాలని వారు వేడుకున్నారు. అంతే కాకుండా కాలనీలో కొన్ని బ్లాకులకు వీధిలైట్లు పెట్టలేదని, దీంతో ఆ ప్రాంతమంతా చీకటిగా ఉందని వారు మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ఇటీవల తమ సమస్యలపై అధికారులకు, నాయకులకు విన్నవించినా పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వారు తెలిపారు. ఇందుకు మున్సిపల్ చైర్మన్ సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బంగల్‌పేట్, రామారావు బాగ్ కౌన్సిలర్లు బిట్లింగు నవీన్, ఏ. పద్మాకర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

తైక్వాండో అకాడమీ ప్రారంభం



నిర్మల్ కల్చరల్, ఆగస్టు 30 : నిర్మల్ పట్టణం ఈద్గామ్ చౌరస్తాలో తైక్వాండో అకాడమీని శుక్రవారం డీఎస్పీ గంగారెడ్డి ప్రారంభించారు. మార్షల్ ఆర్ట్స్, ఫిట్నెస్ ప్రతి ఒక్కరికి అవసరమని ఆయన అన్నారు. పోలీసు విభాగంలోను ఈ శిక్షణ ఇవ్వాలని సూచించారు. తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు సోమేష్, సెక్రటరీ జి. కిషన్ , విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లాలో విస్తరించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

గ్రామస్థులు కలిసి మెలసి ఉండాలి

- పార్డి(కే) లో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



గ్రామస్తులతో మాట్లాడుతున్న జేసీ



అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రహరీని పరిశీలిస్తున్న జేసీ

కుభీర్, ఆగస్టు 30 : కులమత బేదాలకు అతీతంగా గ్రామస్తులు కలిసి మెలసి ఉండాలని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. గత నాలుగు నెలలుగా పార్డి(కే) గ్రామంలో రెండు వర్గాల మధ్య జరుగుతున్న విబేదాలను పరిష్కరించేందుకు శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో గల డా. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం చుట్టు నిర్మించిన ప్రహరీగోడపై వివిదాం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ విదాంలో అగ్రవర్ణాల వారు సాంఘీక బహిష్కరణ చేశారని ఫిర్యాదు చేయడంతో పలువురిపై అట్రాసిటీ కేసులు నమోదుయ్యాయి. అప్పటి నుండి గ్రామంలో వర్గ విబేదాలు నెలకొన్నాయి. శుక్రవారం జేసీ ఫైజాన్ అహ్మద్, ఏఎస్పీ అవినాష్‌కుమార్, ఆర్‌డీవో కోమల్‌రెడ్డి సమావేశ నిర్వహించారు. అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అగ్రవర్ణాల వారు తమకు సహాయ నిరాకరణ చేస్తున్నారని వ్యవసాయ పనులకు ట్రాక్టర్‌లను పంపడం లేదని తమ ఆటోల్లో ఎవ్వరు రావడం లేదని కొందరు అధికారులకు తెలిపారు.

కాగా మరోవర్గం వారు మాట్లాడుతూ అలాంటిది ఏమి లేదని కావాలనే సమస్యను మరింత తీవ్రంగా చేస్తున్నారని అన్నారు. ఆలయ ప్రాంగణంలో వారు బుద్ధ ధర్మం ప్రకారం పెండ్లీలు చేస్తామంటే మేమెలా ఒప్పుకోవాలని అధికారులకు వివరించగా సమస్య పరిష్కరిస్తామని బుద్ధవిహారం కోసం స్థలం కేటాయిస్తామని హామి ఇచ్చారు. అందరు కలిసి మెలసి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సోము, ఎంపీడీవో మోహన్‌సింగ్ , భైంసా రూరల్ సీఐ నైలు, ఎస్సై రవీందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు .

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా

కొత్త బస్సులను ఏర్పాటు చేయాలి

- ప్రయాణ ప్రాంగణం ముందు ధర్నా
- ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే.లక్ష్మి

నిర్మల్ టౌన్, ఆగస్టు 30 : రాష్ట్రప్రభుత్వం ప్రయాణికులకు సరిపడా బస్సులను ఏర్పాటు చేసి తగిన సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా ప్రయాణ ప్రాంగణం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం సంతకాల సేకరణ చేసి బస్సుస్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కె.లక్ష్మీ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో మహిళలు ఎక్కువ ప్రయాణాలు, రాకపోకలు కొనసాగిస్తున్నారని, దీనివల్ల ప్రయాణకుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో బస్సుల కొరత ఏర్పడడంతో ఉన్న బస్సుల్లో కిక్కిరిసిపోయిన జనంతో తల్లడిల్లి, ఊపిరి ఆడక సొమ్మసిల్లి పోతున్నారని, వృద్ధులు, వికలాంగులు, చంటిపిల్ల తల్లులు, పురుషులు బస్సుల్లో ఎక్కువ రద్దీ ఉండడంతో సీట్లు దొరకక అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కొన్ని సందర్భాల్లో సీట్ల కోసం కొట్టుకునే పరిస్థితి ఉందని, చివరికి ఆర్టీసీ ఉద్యోగులపై కూడా అసభ్యకరమైన మాటలు, దాడులు కూడా జరుగుతున్నాయని దీనిని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. మహాలక్ష్మీ పథకంకు ముందు రోజుకు సగటున 45 లక్షల ప్రయాణికులు ప్రయాణం చేస్తే ఇప్పుడు సగటున 55 లక్షల మంది ప్రయాణాలు కొనసాగిస్తున్నారని వీటికి సరిపడా బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బస్సులు కూడా ఆపడం లేదని అన్నారు. బస్సులు లేకపోవడంతో ఉన్న బస్సుల్లో ప్రయాణికులు 170 మది ఎక్కడంతో బస్సు టైర్లు సైతం ఊడిపోయాయని ప్రమాదాలు జరుగుతున్నాయని, నివారించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను ఏర్పాటు చేయాలని, బస్సులతో పాటు కొత్త ఉద్యోగాలు కూడా కల్పించాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల మీద పని భారం పడుతుందని వెంటనే కొత్త బస్సులు ఏర్పాటు చేసి ప్రయాణికులను ఆదుకోవాలని ఆర్టీసీలో కొత్త ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న, గంగామణి, లక్ష్మీ, కవిత, విజయ, వసంత, తస్లీన్, తదితరులు పాల్గొన్నారు.



ప్రయాణ ప్రాంగణం ముందు ధర్నా చేస్తున్న పీవోడబ్ల్యూ నాయకులు

ఎమ్మెల్యే వ్యక్తిగత, అధికారిక సిబ్బంది నియామకం

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 30 : నిర్మల్ ఎమ్మెల్యే బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వ్యక్తిగత, అధికారిక సహాయకులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశాయి. నిర్మల్ వ్యక్తిగత సహాయకుడిగా ప్రవీణ్ 97014 38888, అధికారిక సహాయకుడిగా శ్రీకాంత్ 8099466785 నియమితులయ్యారు. హైదరాబాద్‌లో వ్యక్తిగత సహాయకుడిగా శ్రీనివాస్ 9490830999 నియమితులు కాగా, చుక్క శ్రీనివాస్ 9666678696 పీఆర్‌వోగా నియమితులయ్యారు.

అధిక ఫీజులు వసూలు చేసే కాలేజీలపై చర్య తీసుకోవాలి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 30 : జిల్లాలో విద్యార్థుల నుంచి అధికఫీజులు వసూలు చేసే కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలపై తగిన చర్య తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కే. ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ... అనుమతులు లేకుండా కళాశాలలు నిర్వహిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించలేకపోతు న్నారని ఆరోపించారు. సాయిచరణ్, మిథున్, గణేష్, రామకృష్ణ, అఫ్రోజ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మహిళ ఆత్మహత్యా యత్నం.. 100కు డయల్‌తో అడ్డుకున్న పోలీసులు

సోన్ (నిర్మల్), ఆగస్టు 30 : మండలంలోని మాదాపూర్ గోదావరి పుష్కరఘాట్ వద్ద కొండాపూర్ గ్రామానికి చెందిన మహిళల ఆత్మహత్య చేసుకుందామని గోదావరి పుష్కరఘాట్ వద్దకు వచ్చింది. దీంతో ఆ మహిళ భర్త నిజామాబాద్ నుంచి 100కు డయల్ చేయగా స్పందించిన బ్లూకోల్ట్ సిబ్బంది, కానిస్టేబుళ్లు శేఖర్, నరోత్తం అక్కడికి చేరుకొని ఆ మహిళలను కాపాడారు. ఆమె తల్లి దండ్రులను పిలిపించి అప్పగించారు.

పెంబి మండలంలో

64.2 మి.మీ వర్షపాతం నమోదు

నిర్మల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. 16.6 మిల్లీమీటర్లు కాగా, జిల్లాలో అత్యధికంగా పెంబి మండలంలో 64.2 మిల్లీమీటర్లుగా నమోదైంది. అలాగే జిల్లాలో సోన్ మండలంలో 43.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఖానాపూర్ మండలంలో 38.2, కడెం మండలంలో 37.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టు అయిన కడెం ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వరద నీటి ప్రవాహం కొనసాగుతుంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతమైన ఆదిలాబాద్ జిల్లాలో కురిసిన భారీ వర్షాల వల్ల ప్రాజెక్టులోకి 30 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 7.432 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి 2,707 క్యూసెక్కుల వరద నీరు వస్తుంది. లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు.

కౌన్సిలర్‌ను పరామర్శించిన ఈశ్వర్

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 30 : మున్సిపల్ చైర్మన్ జి. ఈశ్వర్ శుక్రవారం స్థానిక కౌన్సిలర్ సలీంను పరామర్శించారు. కౌన్సిలర్ తండ్రి నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట కౌన్సిలర్లు ముజాహిద్ చావుస్, అన్వర్ పాషా, తదితరులున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల వేతనం చెల్లింపు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 30 : మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు చెల్లించాల్సిన జూన్ నెల వేతనం వారి ఖాతాలో జమ చేసినట్టు కమిషనర్ సీవీఎస్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. వారు సమ్మె విరమించి శనివారం నుండి విధులకు హాజరు కానున్నారని తెలిపారు.

నేడే చివరి అవకాశం

కేజీబీవీలో ఖాళీల భర్తీ దరఖాస్తుకు

ముథోల్, ఆగస్టు 30 : మండల కేంద్రమైన ముథోల్‌లోని కేజీబీవీలో ఖాళీల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థులు శనివారం దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి మైసాజి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేజీబీవీలో స్కావెంజర్ పోస్టుతో పాటు అసిస్టెంట్ కుక్ పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇంకా దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు ఆగస్టు 31 సాయంత్రం 4 వరకు పూర్తి చేసిన దరఖాస్తులను సమర్పించాలన్నారు. ఏడవ తరగతి వరకు చదువుకున్న మహిళా అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను మండల విద్యావనరుల కేంద్రంలో అందించాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఎంఆర్‌సీ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో భారీ వర్షం

ఆదిలాబాద్‌అర్బన్, ఆగస్టు30: జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాలలో శుక్ర వారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఒకేసారి ఆకాశం మేఘావృతమై సాయంత్రం 6గంటల ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. జిల్లా కేంద్రంతోపాటు పలు మండలాలలో సైతం వర్షం కురిసింది. రానున్న రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

కారు, లారీ ఢీ: ఒకరి మృతి

నేరడిగొండ, ఆగస్టు 30: జాతీయ రహదారిపై వేగంగా వచ్చిన కారు వెనుక నుంచి లారీని ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందిన ఘటన నేరడిగొండ మండలం కోర్టికల్ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. నేషనల్ హైవేపై లారీని వెనుక నుంచి కారు ఢీ కొట్టడంతో కారులో ఉన్న మహిళ మృతిచెందగా ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వారిని స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. మృతురాలు సిరికొండకు చెందిన ముత్యపు లాస్యగా గుర్తించారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఏదీ?

- పోలీసు వ్యవస్థ బలోపేతమే ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కాదు
- మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు
- ముఖ్యమంత్రికి 16పేజీల బహిరంగ లేఖ విడుదల



బహిరంగ లేఖను విడుదల చేస్తున్న భుజంగరావు

ఉట్నూర్, ఆగస్టు30: కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు పక్కనబెడితే ముఖ్యమైన ఏడో హామీ ప్రజాస్వామ్య పునరుద్ధరణ అమలు రాష్ట్రంలో ఏదీ అని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రికి పంపిన బహిరంగ లేఖను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం అంటే ఒక్క పోలీసు వ్యవస్థనే బలోపేతం చేయడం కాదన్నారు. ప్రజల హక్కులు, స్వేచ్ఛను కాపాడుతూ అందులో ఉన్న లోటుపాట్లు సరిచేయాలని సూచించారు. ఒకప్పుడు నిరసనలు, ధర్నాలు చేయడమే నేరంగా చేసి కేసులు పెట్టారని, ప్రస్తుతం ఇళ్లలో ఉన్నవారిని కూడా పోలీసు స్టేషన్లకు తరలిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంస్కృతిని గత బీఆర్ఎస్ ప్రారంభిస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. ప్రభుత్వం ఏదైనా కొత్త చట్టం తెస్తే ప్రజాపోరాట సంస్థలు సభలను నిర్వహించేందుకు కూడా పోలీసులు అడ్డంకులు కల్పిస్తున్నారు. హక్కుల కార్యకర్తలు చట్టపరంగా ప్రజల పక్షాన మాట్లాడితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అర్బన్ నక్సలైట్ల పేరుతో అణిచివేసే వ్యూహాన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో న్యాయవాదులపై పోలీసుల దౌర్జన్యాలు పెరుగుతున్నాయన్నారు. కాంగ్రెస్ 9నెలల పాలనలో పోలీసుల హింసను పేదలు, దళితులే ఎక్కువగా అనుభవించారన్నారు. గత ప్రభుత్వం అణిచివేతలు చేయడంతోనే ప్రజలు గద్దె దింపారని ఆత్రం భుజంగరావు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల సంస్కృతిలో మార్పునకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. పరిపాలన పోలీసుమయం కాకుండా చూడాలని కోరుతున్నట్టు తెలిపారు.



ఇచ్చోడలో వేడుకలకు హాజరైన బోథ్ ఎమ్మెల్యే అనిల్

ఘనంగా సంత్‌సేనా మహరాజ్ పుణ్యతిథి

ఇచ్చోడ, ఆగస్టు, 30: మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో శుక్రవారం నాయీబ్రాహ్మణుల కుల ఆరాధ్య దైవమైన సంత్‌సేనా మహరాజ్ పుణ్యతిథి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బోథ్ ఎమ్మెల్యే నాయిబ్రాహ్మణుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంఘ భవనానికి కావాల్సిన వసతులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే భవనానికి వసతులు కల్పిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణ సేవాసంఘం సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏడాది శ్రావణ మాసంలో చివరి వారం పుణ్యతిథిని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారమని అన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఇందులో సంఘం అధ్యక్షుడు వడ్నాల రవి, సంఘ సభ్యులు సింగారపు లక్ష్మీనారాయణ, వడ్నాల రాము, జనగామ లక్ష్మణ్, సింగారపు రాములు, ప్రభాకర్, కతులాపూరం పోతన్న, తదితరులు పాల్గొన్నారు.

● రోడ్డు పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

ఇచ్చోడ: మండల కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం పరిశీలించారు. మండల కేంద్రంలో రూ.13కోట్లతో చేపడుతున్న ప్రధాన రహదారి పనులను నడుచుకుంటూ వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు పనులకు సంబంధించి నాణ్యత ప్రమాణాలు పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు.

తలమడుగులో పూలాజీబాబా శత జయంతి

తలమడుగు, ఆగస్టు 30: ఆధ్యాత్మిక ధ్యాన గురువు, పరమహంస సద్గురు పూలాజీబాబా శత జయంతి ఉత్సవాలను శుక్రవారం మండల కేంద్రంలోని పూలాజీబాబా ధ్యాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాబా చూపిన ధ్యాన మార్గంలో నడుచుకోవాలని సభ్యులలు కోరారు. అనంతరం అన్నదానం చేశారు. సీనియర్ మాస్టర్ సునీత వెంకట్, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నీలగిరి అశోక్, కార్యదర్శి సునీతారెడ్డి, ఇందిరమ్మ, పిడుగు అభిరామ్‌రెడ్డి, భక్తులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నేరడిగొండ, ఆగస్టు 30: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శుక్రవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గడ్డిమందు పిచికారి చేయించారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయని, ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి ఎండీ సద్దాం, పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి, తదితరులున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి

తాంసి, ఆగస్టు 30: ప్రస్తుతం వర్షాకాలం అయినందున ప్రజలకు వ్యాధులు ప్రభలకుండా ఉండేందుకు కోసం చేపట్టిన పారిశుధ్యం పనులను వేగవంతం చేయాలని జిల్లా ప్రణాళిక అధికారి వెంకటరమణ అన్నారు. శుక్రవారం మండలంలోని పొన్నారి గ్రామంలో చేపడుతున్న పారిశుధ్యం పనులను ఆయన పరిశీలించారు. గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ ఎక్కడైనా మురికి నీరు నిల్వ ఉందో ఆరా తీశారు. మురికి కాలువల పరిశుభ్రతపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలి

● ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు పట్టింపు లేదు ● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 30: వైద్య రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, విషజ్వరాలు ప్రభలుతున్న మొద్దునిద్రలో ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆరోపించారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాను హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో వైద్య రంగానికి పెద్దపీట వేశామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేలా కృషి చేశామని తెలిపారు. విషజ్వరాల భారీన పడి ప్రజలు అల్లాడుతుంటే జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క అధికారులతో కనీసం సమీక్ష నిర్వహించడం లేదన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించకుండా కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో పట్టణ, పల్లె ప్రగతి కార్యక్రమాల ద్వారా పరిసరాల పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యతను ఇచ్చి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేశామని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్వచ్ఛదనం పచ్చదనం పేర్తి 5రోజులు కార్యక్రమాలను నిర్వహించినప్పటికి వాటికి నిధులు కేటాయించక పోవడం వారి చిత్తశుద్ధికి అద్దం పడుతుందన్నారు. అదే విధంగా రిమ్స్ ఆసుపత్రిలో, పీహెచ్‌సీలలో మందుల కొరత తీవ్రంగా వేధిస్తోందని, ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రైవేట్ మెడికల్‌లకు మందులు రాసిన అధికారులపై వేటు వేస్తున్నారన్నారు. క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది.. వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. జిల్లాలో వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తోందని, తాజాగా రిమ్స్‌లో పని చేస్తున్న వైద్యులను బదిలీ చేశారని ధ్వజమెత్తారు. ఇకనైనా ప్రభుత్వం జిల్లాపై సవతితల్లి ప్రేమను చూపించకుండా తక్షణం ఆదిలాబాద్‌లో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో రైతు సమన్వయ అధ్యక్షుడు రోకండ్ల రమేష్, మాజీ మార్కెట్ చైర్మన్లు మెట్టు ప్రహ్లాద్, యాసం నర్సింగ్‌రావు, ఇజ్జగిరి నారాయణ, పట్టణ అధ్యక్షుడు అజయ్, సాజిదొద్దిన్, కొమ్ర రాజు, సెవ్వ జగదీశ్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న



గ్రామం నుంచి పాదయాత్ర నిర్వహిస్తున్న రైతులు

రుణమాఫీ కోసం రైతుల పాదయాత్ర

తాంసి, ఆగస్టు 30: తాంసి మండలం కప్పర్ల గ్రామ రైతులు శుక్రవారం కాలినడకన మండల కేంద్రానికి వచ్చి తహసీల్దార్ కార్యాలయం ఎదుట షరతులు లేకుండా రుణమాఫీ చేయాలంటూ ఆందోళన చేశారు. రెండు లక్షల రూపాయలకు పైగా రుణాలున్న ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మీతో పాటు మండల వ్యవసాయ అధికారికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రైతు నీరటి రాకేష్ మాట్లాడుతూ అర్హత ఉండి తమ గ్రామంలో ఎంతో మంది రైతులకు రుణమాఫీ జరగలేద, కుటుంబంలో ఇద్దరి, ముగ్గురి రుణాలన్నింటిలో ఏఒక్కరి రుణం కూడా ఇప్పటి వరకు మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రుణాల మాఫీ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని రైతులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

డెంగ్యూ సర్వే త్వరగా పూర్తి చేయాలి

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 30: జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మెప్మా ఆర్పీలతో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఇందిర మహిళా శక్తిపై అవగాహన కల్పించారు. అనంతరం డెంగ్యూ సర్వేపై ఆరా తీసి.. త్వరగా పూర్తి చేయాలని అన్నారు. స్త్రీనిధి ఆర్ఎం పూర్ణచందర్, మెప్మా ఇన్‌చార్జి వెంకటేష్, తదితతరులున్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి : సీఐ

తలమడుగు, ఆగస్టు 30: పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలని ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణీందర్ కోరారు. శుక్రవారం తలమడుగు పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పండుగలను శాంతి సామరస్యలతో శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. ముఖ్యంగా వినాయక చవితి సందర్భంగా గణపతులను ప్రతిష్ఠించే యువకులు ప్రతీ గణేష్ మండపం వారు ఆన్‌లైన్ నమోదు చేయించుకోవాలని కోరారు. అదేవిధంగా మండపం దగ్గర ఎప్పుడూ ఇద్దరు సభ్యులు ఉండాలని సూచించారు. డీజేలకు అనుమతులు లేవని పేర్కొన్నారు. గణేష్ మండపాల వద్ద ఎలాంటి ఆటంకాలు కలిగిన బాధ్యులు కమిటీ సభ్యులేనన్నారు. ఇందులో ఎస్సై అంజమ్మ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిమ్మలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

జైనత్, ఆగస్టు 30: మండలంలోని గిమ్మా గ్రామంలో గల జల్లడుగణపతి, రేణుక ఎల్లమ్మ ఆవరణలో నిర్మించిన 11 అడుగుల ఎత్తుగల అభయ అంజనేయ విగ్రహాన్ని శుక్రవారం డప్పులు భజాల మధ్య విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దేబె వెంకటపంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో మాజీ సర్పంచ్ కోల సుమ పరమేశ్వర్, గిమ్మా ఎంపీటీసీ కోలభోజన్న, గ్రామ అభవృద్ధి కమిటీ చైర్మన్ మోహన్‌దాస్, భూదాతలు పెంటపర్తి ఆశన్న, అర్థంతి ముత్తన్న, ఆలయ కమిటీ, వీడీసీల సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా దేవపూజ్ మారుతి

ఇంద్రవెల్లి, ఆగస్టు 30: బీజేపీ ఓబీసీ మోర్చా ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా దేవపూజ్ మారుతి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్ నితే ష్ ఆధ్వర్యంలో బీజేపీ మండల కమిటీ సభ్యులతో కలిసి దేవపూజ్ మారుతిని శాలువాతో సన్మానించారు. అనంతరం దేవపూజ్ మారుతి మాట్లాడారు.

వ్యవసాయంలో విత్తనం ఎంతో కీలకం

● రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 30: వ్యవసాయంలో విత్తనం ఎంతో కీలకమని దాన్ని రైతులకు నాణ్యమైనవి అందించేలా ప్రణాళికలు చేస్తున్నామని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో విత్తన సంస్థను నిర్వీర్యం చేసి ప్రైవేట్ కంపెనీలను పోశించిందన్నారు. అంతేకాకుండా 2018 నుంచి రైతుబంధు వచ్చిన సమయం నుంచి అన్ని సబ్సిడీలను ఎత్తి వేశారన్నారు. అందులో విత్తన సబ్సిడీ కూడా ఉందన్నారు. విత్తన అభివృద్ధి సంస్థకు మళ్లీ పూర్వ వైభవం తీసుకువచ్చేలా రైతులకు రబీలో విత్తనాలను సరఫరా చేసేలా ప్రయత్నాలు సాగిస్తున్నామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అందులో భాగంగానే జిల్లాలను పర్యటిస్తూ రైతులు,ఆగ్రో, సహకార సంఘాల వారితో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రబీలో విత్తనాలను అధికంగా ఇచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఏక కాలంలో రుణమాఫీ పై ప్రభుత్వం స్పష్టతగా ఉందన్నారు. రుణమాఫి చేయమని ఎక్కడ చెప్పలేదని, కాని ప్రతిపక్షాలు మాత్రం రైతులను ఆందోళనలకు గురి చేసేలా వ్యవహరిస్తున్నాయన్నారు. రేషన్ కార్డు లేని వారి వివరాలను కూడా వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా తెలుసుకుంటున్నామని పేర్కొన్నారు.

ఇదేనా గౌరవం!?

● ఆదిలాబాద్ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌కు తాళం

● అధికారులెవరూ రాకపోవడంతో బయటే వేచి ఉన్న విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్



కాన్ఫరెన్స్ హాల్ బయటే వేచి ఉన్న చైర్మన్ అన్వేష్‌రెడ్డి

రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా ఆదిలాబాద్‌కు వచ్చిన సుంకెట అన్వేష్‌రెడ్డికి అవమానం జరిగింది. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 2గంటలకు అన్వేష్ రెడ్డి మీడియా సమావేశం ఉంటుందని జిల్లా సమాచార శాఖ అధికారిణి స్వయంగా అధికారిక వాట్సాప్ గ్రూపులో సందేశం పెట్టారు. చెప్పిన సమయానికి పది నిమిషాల ముందే చైర్మన్ అన్వేష్‌రెడ్డి అక్కడకు చేరుకున్నారు. అయితే ఆ సమయంలో అధికారులు, సిబ్బంది ఎవరూ లేరు. కనీసం స్వాగతం పలికేవారూ కరువయ్యారు. పైగా కాన్ఫరెన్స్ హాలుకు సైతం తాళం వేసి ఉండడంతో అన్వేష్‌రెడ్డి 15 నిమిషాల పాటు బయటే వేచి ఉండాల్సి వచ్చింది. దీంతో అక్కడ ఉన్న వారు ఇదేనా సంస్థ రాష్ట్ర చైర్మన్‌కు అధికారులు ఇచ్చే గౌరవం అంటూ గుసగుసలాడుకోవడం కనిపించింది. ఆ తర్వాత కలెక్టరేట్ సిబ్బంది రావడంతో.. అన్వేష్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. (- ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)

తాంసిలో రైతుల వివరాల సేకరణ

● కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

తాంసి, ఆగస్టు 30: జిల్లాలో వివిధ కారణాలతో రుణమాఫీ కాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా తెల్ల రేషన్ కార్డు లేని వారికి ఈ పథకం వర్తించకపోవడంతో తమకు మాఫీ అవుతుందా? లేదా? అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిని గమనించిన సర్కార్ వారికి కూడా పథకం వర్తించేలా కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని బుధవారం నుంచి ప్రారంభించింది. రూ.2 లక్షల లోపు రుణం ఉండి, రేషన్ కార్డు లేక రుణమాఫీ పొందని కటుంబాలను గుర్తించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. కాగా శుక్రవారం మండల కేంద్రంలో కొనసా గుతున్న కుటుంబ నిర్ధారణ ప్రక్రియను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ స్వామి పరిశీలించారు. స్థానిక ఏవోతో మాట్లాడి ప్రక్రియ సాగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏవో టెక్నికల్ శివకుమార్, ఏఈవో సుప్రీయ, తదితరులు పాల్గొన్నారు.

రీడింగ్ క్యాంపెయిన్‌లో పాల్గొనండి : డీఈవో



మాట్లాడుతున్న డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 30 : ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సెప్టెంబరు 8 వరకు జరిగే రీడింగ్ క్యాంపెయిన్‌లో పాల్గొనాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం సీఆర్పీలకు ఫౌండేషన్ లిట్రేసి అనే అంశంపై రెండు రోజుల శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ పథకం అమలు చేస్తోందన్నారు. రూమ్ టు రీడ్ సంస్థ విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తుందన్నారు. శిక్షణ ఉపయోగించుకొని గుణాత్మక విద్యను అందించాలన్నారు. రూమ్ టు రీడ్ సంస్థ జిల్లా ఇన్‌చార్జి గోనె రవి, బ్లాక్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కుభీర్, ఆగస్టు 30 : మండల కేంద్రం కుభీర్‌లోని శివసాయి ఆలయంలో శుక్రవారం భారతీయ జనతాపార్టీ సభ్యత్వ నమోదుపై సమావేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఏశాల దత్తాత్రి మాట్లాడుతూ సెప్టెంబర్ 3వ తేదీన రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి అధ్యక్షతన ఈ-సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం అవుతుందని ప్రతి గ్రామంలోని కార్యకర్తలు బూత్ స్థాయిలో ఇంటింటికి వెళ్లి పార్టీని బలోపేతం చేస్తూ రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదుకు కృసి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పడిపెల్లి గంగాధర్, ప్రధాన కార్యదర్శి బొమ్మెడి మల్లేష్, సభ్యత్వ నమోదు మండల కోఆర్డినేటర్ పండిత్‌జాదవ్, బీఎస్ఎన్ఎల్ బోర్డు మెంబర్ బోడిగాం గంగాశేఖర్, సావుల మల్లన్న, కందూర్ సాయినాథ్, శంకర్, నాగభూషణ్, వినయ్, మాజీ సర్పంచ్‌లు, మండల నాయకులు, కార్యకర్తలున్నారు.

ఘనంగా అన్నబాహుసాఠే జయంతి



కుభీర్, ఆగస్టు 30 : మండలంలోని హల్దా, జుండా, గ్రామాల్లో శుక్రవారం అన్నబాహుసాఠే 104వ జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా అన్నబాహు సాఠే చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం అన్నబాహుసాఠే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అన్నబాహుసాఠే సేవ సమితి జిల్లా అధ్యక్షులు నామత్కర్ దిగంబర్, జిల్లా ఎంఆర్‌పీఎస్ నాయకులు గోనేకర్ శంకర్, తదితరులున్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎస్పీ

ఆసిఫాబాద్, ఆగస్టు 30: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరిగేలా చూడాలని ఎస్పీ డీవీ శ్రీనివాస్ ఒకప్రకటనలో పేర్కొన్నారు. గణేష్‌మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ముందుగా ఒకరి పేరు ద్వారా పోలీసు పోర్టల్‌లో tspolice.gov.in వెబ్‌సైట్ ద్వారా ఏర్పాటు చేసే గణేష్ ప్రతిమఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, నిమజ్జనం తేదీ, ప్రదేశం తదితర సమాచారంతో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం దరఖాస్తు కాపీని సంబంధిత పోలీసుస్టేషన్‌లో సమర్పించి పర్మిషన్ పత్రాన్ని తీసుకోవాలన్నారు.

ఐఐటీ విద్యార్థికి ఆర్థిక సహాయం అందించాలి

ఆసిఫాబాద్, ఆగస్టు 30: వాంకిడి మండలంలోని ప్రభుత్వకళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన దుర్గం అర్జున్ జేఈఈ మెయిన్స్ పరీక్షరాసి 1782వ ర్యాంకు సాధించి జోద్‌పూర్ ఐఐటీ కళాశాలలో సీటు సాధించాడు. అతనికి ఎస్సీకార్పొరేషన్‌ద్వారా ఆర్థిక సాయం అందించాలని శుక్రవారం ఎస్సీ అభివృద్ధి అధికారి సజీవన్‌కు డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు.

ఓటరు జాబితాను సిద్ధం చేయాలి

జైనూర్, ఆగస్టు 30: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సత్వరమే ఓటరు జాబితాను సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ కోరారు. కార్యక్రమంలో మండలంలోని బీఎల్‌వోలు పాల్గొన్నారు.



మున్సిపాలిటీలో కీలక పోస్టులన్నీ ఖాళీ

● భర్తీకాక ప్రజలకు ఇబ్బందులు

● ఇన్‌చార్జీలతోనే కొనసాగుతున్న పనులు

కాగజ్‌నగర్, ఆగస్టు 30: కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో కీలక పోస్టులన్నీ ఖాళీలుగా ఉన్నాయి. ఈ మున్సిపాల్టీలో 71పోస్టులు ఉండగా, ఇందులో ప్రస్తుతం 51మంది ఉద్యోగులు వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్నారు. ఇంకా 20పోస్టులు ఖాళీలుగానే ఉన్నాయి. పూర్తి స్థాయిలో సిబ్బందికి లేకపోవటంతో ఇన్‌చార్జీలతోనే వెళ్లదీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. శానిటరీ జవాను 2పోస్టులు ఉండగా ఇందులో 1 ఖాళీగా ఉంది. మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులు 2ఉండగా, అందులో ఒకటి ఖాళీగా ఉంది. అలాగే సీనియర్ అసిస్టెంట్‌లు 4 పోస్టులు ఉండగా, ఒక పోస్టు ఖాళీ ఉంది. జూనియర్ అసిస్టెంట్లు ఏడు పోస్టులుండగా, ఇందులో మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాచ్‌మెన్ పోస్టులు రెండు ఉండగా, ఒక పోస్టు ఖాళీగా ఉంది. పబ్లిక్ హెల్త్ వర్కర్స్ 34మంది ఉండాల్సి ఉండగా, ఇందులో 12పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అటెండర్లు ముగ్గురు ఉండాల్సి ఉండగా, ఒక పోస్టు ఖాళీ ఉంది. ఇంతవరకు ఆయా ఖాళీల్లో ఎవరినీ భర్తీ చేయలేదు. పట్టణంలోని టౌన్ ప్లానింగ్ పోస్టులో పనిచేస్తున్న అధికారి యశ్వంత్ ఇన్‌చార్జీగా కొనసాగుతున్నారు. ఆయన కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, డీటీసీపీవో, నస్పూర్, ఆదిలాబాద్, చెన్నూరు మున్సిపాల్టీలకు ఇన్‌చార్జీగా విధులు నిర్వహిస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారి పట్టణంలో నూతన ఇళ్ల నిర్మాణానికి అనుమతుల కోసం విచారణ చేయటం, ఆక్రమణల తొలగించాల్సి ఉంటుంది. ఇంతటి ముఖ్యమైన స్థానానికే ఇన్‌చార్జి అధికారి కేటాయించారు. దీంతో కొన్ని సందర్భాల్లో పనులు ముందుకు సాగక పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా టెక్నికల్ అధికారి మధు ఇక్కడ పనిచేయాల్సి ఉండగా నస్పూర్ మున్సిపాల్టీలో ఇన్‌చార్జీగా కొనసాగుతున్నారు. ఈ మధ్య వర్షాలు కురవడంతో వివిధ వార్డుల్లో పారిశుధ్యం పేరుకుపోయింది. దీనిని శుభ్రం చేయించాల్సిన బాధ్యత శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై ఉంటుంది. ఆయా పోస్టులో ఒక్కరే ఉన్నారు. మరొకటి ఖాళీగా ఉండటంతో ఇన్‌చార్జీతో కొనసాగిస్తున్నారు. ఇన్‌చార్జిల పాలన కొనసాగుతండటంతో పట్టణ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆస్తి పన్ను వసూలు సమయంలో కూడా పూర్తి సిబ్బంది లేక పోవటంతో వివిధ శాఖల్లో పనిచేసే సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ వసూళ్ల కోసం పంపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పూర్తిసా యిలో అధికారులను కేటాయించి మున్సిపల్ పురోభివృద్ధికి కృషి చేయాలని పట్టణవాసులు డిమాండు చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..

-అంజయ్య, మున్సిపల్ కమిషనర్, కాగజ్‌నగర్



మున్సిపాల్టీలో 71పోస్టులు ఉండగా, ఇందులో 50మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇంకా 20పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కీలక పోస్టులు ఇన్‌చార్జిలతో నడిపిస్తున్నాం. పనులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ఆదర్శం పూలాజీబాబా జీవితం: కలెక్టర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే తదితరులు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

జైనూర్, ఆగస్టు 30: పూలాజీబాబా జీవితం ఆచర ణీయం, ఆదర్శనీయమని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జైనూర్ మండలం పట్నాపూర్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన పూలాజీబాబా 100వ జయంతి మహో త్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని భక్తులను ద్దేశించి మాట్లాడారు. ధ్యానంతో కోపం, ఆవేశాలను అణిచివేసుకొని, ప్రతిసందర్భాన్ని ప్రశాంతంగా నిర్వహించే సమర్థతను పులాజీబాబా సాధించారన్నారు. అదేవిధంగా ప్రతిఒక్కరూ తమ దైనందిన జీవితంలో వ్యాయామం, ధ్యానం కోసం కొంత సమయాన్ని కేటాయిస్తే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ పూలాజీబాబా జయంతి వేడుకలకు రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అస్సాం, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి వేలాది మంది భక్తులు తరలి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పూలాజీబాబా ప్రబోధనలు భావితరాలకు ప్రసరింపజేయాలని కోరారు. ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్త మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నివసిస్తున్న గిరిజనుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావ్ మాట్లాడుతూ పట్నాపూర్ సిద్దేశ్వర్ ప్రాంగణంలో వేలాదిభక్తులు శాంతియుతంగా వేడుక జరుపుకోవడం సంతోషంగా ఉందన్నా రు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు కలెక్టర్ వెంకటేష్‌దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనవాస్‌రావ్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్త, అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, ఎమ్మెల్యే వెడ్మబొజ్జు తదితరులకు పులాజీబాబా చిత్రపటాలను బహూకరించి సన్మానిం చారు. అంతకుముందువారు పూలాజీబాబా సమాధి మందిరంలో పూజలు చేశారు.

కార్యక్రమంలో పట్నాపూర్ సిద్దేశ్వర్ సంస్థాన్ అధ్యక్షుడు ఇంగ్లేకేశవ్‌రావ్, గౌరవ అధ్యక్షుడు ఇంగ్లేవామన్‌రావ్, పూలాజీబాబా సతీమణి ఇంగ్లే ద్రుపదబాయి, జిల్లా కార్యదర్శి దుక్రె సుభాష్, అంద్ సమాజ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ముకాడె విష్ణు, రాష్ట్రఅధ్యక్షుడు కుడె కైలాస్, జిల్లా కార్యదర్శి గారులె నారాయణ, సంస్థాన్ కమిటీ సభ్యులు, ఏఎస్పీ ప్రభాకర్, డీఎస్పీ సదయ్య, సీఐ రమేష్, ఎస్ఐ సాగర్, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'వర్క్‌షాప్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి'

శ్రీరాంపూర్, ఆగస్టు 30: ఏరియా వర్క్‌షాప్ కార్మికులసమస్యలు పరిష్కరించాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్ రెడ్డి కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం కార్మికులతో కలిసి డీజీఎం రవీందర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ, ఇటీవల సింగరేణి ఉద్యోగుల వ్యక్తిగత సమాచారాన్ని ఆన్‌లైన్ చేయడంలో తప్పులు దొర్లాయన్నారు. అందుకే సిబ్బందిని వర్క్‌షాప్‌లో నియమించి సరిచేయాలన్నారు. మహిళా కార్మికులకు వాష్‌రూమ్‌లు, రెస్ట్‌హాళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిట్‌కార్యదర్శి పొన్నగంటి అశోక్, కేంద్రఆర్గనైజింగ్ కార్యదర్శి దుర్గం లక్ష్మణ్, కార్మికులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై శిక్షణ

లింగాపూర్, ఆగస్టు 30: ఓటరునమోదుపై బీఎల్‌వోలకు తహసీల్దార్‌కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ రాజేంద్ర ప్రసాద్‌వర్మ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బీఎల్‌వోయాప్‌లో ఓటరునమోదు ఏవిధంగా చేయాలి అనేఅంశాలపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దయ్య, ఆర్ఐప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.




● బట్టిసావర్గాం చెరువులో ఏర్పాటు చేసిన అగ్రజా టౌన్‌షిప్ పార్కు స్థలం ముంపునకు గురికాకుండా ఏర్పాటు చేసిన రిబిట్‌మెంట్



● జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిని ఆనుకుని కబ్జాకు గురైన నాలా

అడ్డగోలు.. నిర్మాణాలు

- జిల్లాకేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లోని చెరువులు, కుంటల్లో జోరుగా అక్రమ నిర్మాణాలు
- పట్టణంలోని బట్టిసావర్గాం చెరువు ఎఫ్‌టీఎల్‌లో పార్కు స్థలం
- యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్న నాలాలు
- ఖానాపూర్, మావల చెరువుల్లోనూ అక్రమ కట్టడాలు
- రోజురోజుకూ కనిపించకుండా పోతున్న ప్రభుత్వ భూములు
- మితిమీరిపోతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలు
- ఈ అక్రమ దందాలకు మున్సిపల్ అధికారుల అండదండలు!!
- ఫిర్యాదులున్నా.. పట్టించుకోని వైనం
- జిల్లావ్యాప్తంగా హైడ్రాలాంటి విధానాన్ని అమలు చేసే అవకాశం



ఆదిలాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లోని చెరువులు, కుంటల్లోనూ అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఖాళీ జాగా కనిపిస్తే చాలు కబ్జా చేస్తూ యథేచ్ఛగా నిర్మాణాలను చేపడుతున్నారు. ఆదిలాబాద్ పట్టణం వేగంగా అభివృద్ధి చెందడంతో.. ఇళ్ల స్థలాలకు భారీ డిమాండ్ ఉంది. దీంతో జిల్లాకేంద్రం చుట్టూ భారీ వెంచర్లను ఏర్పాటు చేసి అమ్మేస్తున్నారు. అలాగే పట్టా భూములకు ఆనుకొని ఉన్న అసైన్డ్, శిఖం, ప్రభుత్వ భూములు కనిపించకుండానే పోతున్నాయి. నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూములను అమ్మకం, కొనుగోలు చేయరాదు. కానీ కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తెలివిగా ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లను కేటాయిస్తూ రిజిస్ట్రేషన్లను చేయించుకోవడం పరిపాటిగా మారింది. ఈ అక్రమ దందాకు మున్సిపల్ అధికారుల అండదండలు ఉండడంతో యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటూ అమ్మేసుకుంటున్నారు. ముఖ్యంగా జిల్లాకేంద్రాన్ని ఆనుకుని ఉన్న మావల, బట్టిసావర్గాం, అనుకుంట, అంకోలి, తంతోలి, తదితర గ్రామాలలో విచ్చలవిడిగా అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలుస్తుంది. అయితే అక్రమ నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించిన విషయం తెలిసిందే. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో భారీ నిర్మాణాలను కూల్చివేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి విధానమే జిల్లాలో అమలు చేస్తే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా హైడ్రా పైనే చర్చించుకోవడం కనిపిస్తుంది. అయితే త్వరలోనే జిల్లాలో కూడా హైడ్రాలాంటి విధానాన్ని అమలు చేసే అవకాశం ఉందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

అగ్రజా టౌన్‌షిప్‌లో అక్రమాలు

గత ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్రాన్ని ఆనుకొని ఉన్న 44వ జాతీయ రహదారి సమీపంలో అగ్రజా టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేశారు. మావల మండలం బట్టిసావర్గాం శివారు ప్రాంతంలోని సర్వే నెం.72/1/2, 72/1/3లో గల 29 ఎకరాల 86 సెంట్ల విస్తీర్ణంలో వెంచర్‌ను ఏర్పాటు చేశారు. గత రెండేళ్ల క్రితమే ఈ ప్లాట్లకు వేలం పాటను నిర్వహించి అమ్మేశారు. గతంలో ప్రభుత్వ ఒత్తిళ్లతో అధికారులు హడావుడిగా ఓపెన్ ప్లాట్లను విక్రయించారు. అయితే బట్టిసావర్గాం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో పార్కు స్థలాన్ని కేటాయించి ముంపునకు గురికాకుండా రిబిట్‌మెంట్‌ను ఏర్పాటు చేశారు. అప్పట్లోనే పార్కు స్థలం కేటాయింపు పై పలు రకాల విమర్శలు వచ్చాయి. అయిన అధికారులు పట్టించుకోలేదు. చెరువులో పూర్తి స్థాయిలో నీటిమట్టం చేరితే పార్కు స్థలం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. నిబంధనల ప్రకారం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలను చేపట్టరాదు. కానీ అన్ని తెలిసిన అధికారులే నిబంధనలను గాలికి వదిలేయడంతో భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



● ఖానాపూర్ చెరువు ఎఫ్‌టీఎల్‌లో కనిపిస్తున్న అక్రమ కట్టడాలు

కనుమరుగవుతున్న నాలాలు

జిల్లాకేంద్రంలో అడ్డగోలుగా అక్రమాలు జరగడంతో భారీ నాలాలు, కందకాలు, చిన్నపాటి కాల్వలుగా మారిపోతున్నాయి. దీంతో వర్షాకాలంలో లోతట్టు ప్రాంతంలోని ఇళ్లలోకి వర్షపునీరు చేరి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతీయేటా వర్షాకాలంలో ముంపునకు గురికావడం, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరి మురికి గుంటలుగా మారిపోతున్నాయి. నాలాలు, కందకాల్లో చేరిన పూడికను తొలగించక పోవడంతో నేలమట్టమవుతున్నాయి. ఆ తర్వాత కబ్జా చేస్తూ కట్టడాలను నిర్మిస్తున్నారు. జిల్లాకేంద్రంలోని దస్నాపూర్ బ్రిడ్జి నుంచి టైలర్స్ కాలనీని ఆనుకొని ప్రవహించే వాగు చాలా చోట్ల అక్రమాలకు గురైనట్లు ఫిర్యాదులు ఉన్నాయి. రిమ్స్ ఆసుపత్రిని ఆనుకొని ప్రవహించే నాలాలో అడ్డగోలుగా నిర్మాణాలను చేపట్టారు. పంజాబ్ చౌక్, శాంతినగర్ కాలనీల్లోని నాలాలు కబ్జాకు గురై కనుమరుగవుతున్నాయి. మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కుమ్మక్కవుతున్న కబ్జాదారులు అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారు. దొరికితే దొంగ.. లేకపోతే దొర అన్న చందంగా అక్రమ కట్టడాల జోరు కనిపిస్తోంది. ఇదంతా నిత్యం కళ్లముందే జరుగుతున్నా.. మున్సిపల్ అధికారులు పట్టించుకోక పోవడమే ఈ పరిస్థితికి కారణమంటున్నారు. కొన్నిచోట్ల నాలాలపై స్లాబులు వేసి మరీ ఇంటి, వ్యాపార సముదాయాల నిర్మాణాలను చేపట్టిన దాఖలాలు ఉన్నాయి. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొందరు విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడ్డారు.

అధికారులపై నేతల ఒత్తిళ్లు

జిల్లాకేంద్రంలో ఉన్న ఖానాపూర్, మావల చెరువుల్లో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. అయినా అడ్డుకట్ట పడడం లేదు. ఎందుకంటే అధికారులపై నేతలే ఒత్తిళ్లు చేయడంతో ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నా.. అడిగే వారే కరువవుతున్నారు. అక్రమ కట్టడాల జోరు పెరిగిపోవడంతో చెరువుల విస్తీర్ణం భారీగా తగ్గిపోతుంది. ఈ అక్రమాలను అడ్డుకునేందుకు పలుమార్లు జిల్లా అధికారులు ప్రయత్నాలు చేసిన ప్రయోజనమే లేకుండా పోయింది. కొన్ని సందర్భాల్లో అధికారులపై స్థానిక ప్రజాప్రతినిధులే ఎదురు దాడి చేయడంతో అధికారులు సైలెంట్‌గా పోతున్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలతో ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జాలకు గురై కనుమరుగై పోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లాకేంద్రం చుట్టూ ఉన్న చెరువులను కాపాడేందుకు అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇవే పరిస్థితులు మరి కొన్నాళ్ల పాటు కొనసాగితే జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల ఉన్న చెరువులు, కుంటలు కనుమరుగై పోయే ప్రమాదం ఉందంటున్నారు.



సంక్షిప్త సమాచారం

రేపు సర్వసభ్య సమావేశం

ఉట్నూర్, ఆగస్టు 30: మాల మహానాడు సంఘం మండల సర్వసభ్య సమావేశం ఆదివారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు కన్వీనర్లు సింగారే భారత్, బొంకంటి సుభాష్, చిలుకల చిన్నన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎన్నికల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే గ్రామ, మండల, జిల్లా కమిటీల ఎన్నికల నిర్వహణ, ఎస్సీల వర్గీకరణ వ్యతిరేక ఉద్యమం కోసం చర్చలు ఉంటాయని, ఈ సమావేశానికి మహిళలు, పురుషులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పేర్కొన్నారు.

బీజేపీలోకి ముగ్గురు కౌన్సిలర్లు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 30: ఆదిలాబాద్‌లో గులాబీ పార్టీకి గట్టి షాక్ తగిలింది. ముగ్గురు మున్సిపల్ కౌన్సిలర్లు పార్టీని వదిలి ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆధ్వర్యంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముగ్గురు కౌన్సిలర్లు సంజయ్, వార్డు నెం.20, 6వ వార్డు కౌన్సిలర్ నెమలికొండ దయాకర్, 40వ వార్డు కౌన్సిలర్ భరత్ కుమార్‌ను సాదరంగా ఆహ్వానించి ఎమ్మెల్యే పాయల్ శంకర్ బీజేపీ కండువాలు కప్పారు. బీఆర్‌ఎస్ పార్టీ పట్ల ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పార్టీ పట్ల ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పెరిగిన జనాధారణ, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆధ్వర్యంలో పట్టణాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని బీజేపీలో చేరడం జరిగిందని కౌన్సిలర్లు తెలిపారు. కాగా, 150 మంది కార్యకర్తలు బీజేపీ కండువా కప్పుకున్నారు. పట్టణ నాయకులు జిల్లా నాయకులు పాల్గొన్నారు.



5వ వార్డులోని వేముల కిష్టయ్య ఇంటి నల్లా నుంచి వచ్చిన నీటిలో తోక పురుగులు

తాగునీటిలో తోక పురుగులు

● ఆందోళనలో పట్టణ ప్రజలు

బోథ్, ఆగస్టు 30: మండల కేంద్రంలో తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. శుద్ధ జలం కలుషితమై ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చేదిగా ఉందని పలు వార్డుల ప్రజలు ఆందోళన చేస్తున్నారు. పట్టణంలో ప్రజలు ఇప్పటికే వైరల్ జ్వరాల తీవ్రతతో సతమతమవుతుంటే కలుషిత నీరు తమ ప్రాణాల మీదకు తెచ్చేదిగా ఉందని వాపోతున్నారు. కొంత మంది తాగునీటి పైప్‌లను మురికి కాలువలలో వేయడం వల్ల ఈ దుస్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు. అంతేకాకుండా గ్రామ పంచాయతీ వారు మురికి కాలువలలో ఉన్న తాగునీటి పైప్‌లను పరిశీలించి లీకేజీలు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. లేదంటే గ్రామంలో అతిసార వంటి వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందంటున్నారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

● జిల్లా కలెక్టర్ రాజర్షిషా ● ఇచ్చోడలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం ● పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఇచ్చోడలో క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు



ఆదిలాబాద్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయాన్ని ప్రారంభిస్తూ..

ఇచ్చోడ, ఆగస్టు, 30: కృషి పట్టుదలతో ముందుకెళ్తే జీవితంలో సాధించలేనిది ఉండదని జిల్లా కలెక్టర్ రాజర్షిషా, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఇచ్చోడ మండలకేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను శుక్రవారం వారు ప్రారంభించారు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(ఎస్‌ఈఆర్‌పీ) ఆదిలాబాద్ ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చోడ బ్రాంచ్ వారి ఆర్థిక సహాయంతో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభోత్సవానికి ముఖ్యతిథులుగా హాజరై మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు రూపొందిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అనంతరం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. మహిళలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొని ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లినప్పుడే సాధికారిక సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో సాయన్న, బీఆర్‌ఎస్ కన్వీనర్ ఎనుగు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, నాయకులు శిరీష్‌రెడ్డి, దేవానంద్, సుభాష్, షాబీర్, రమేష్, మహేందర్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

● వ్యాపార రంగ అభివృద్ధికి కృషి : కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్: అభివృద్ధికి అనుసందంగా ఉన్న వ్యాపార రంగాన్ని మరింత అభివృద్ధి చేసేలా తనవంతుగా కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన భవన ప్రారంభంలో ఎమ్మెల్యే పాయల శంకర్, జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ కార్యాలయంతో పాటు సీఓసీ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెబ్‌సైట్‌లో పొందుపరిచిన విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ షాపింగ్ కాంప్లెక్స్ కోసం స్థలాన్ని సేకరించడం జరిగిందని, నిధులు మంజూరైన వెంటనే నిర్మాణ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ప్రైవేట్ అసోసియేషన్ సంఘ భవనాలకు స్థలం కేటాయించాలంటే జీవో ప్రకారం ప్రభుత్వం నుంచి అనుమతి రావాలన్నారు. వ్యాపారం ఏదైనా మంచి ప్రోడక్ట్, నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఆ తర్వాత ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ వ్యాపారులకు అండగా ఉంటామని, జిల్లాలో ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇండస్ట్రీ రావాల్సి ఉందని, దీని ద్వారా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. మూతబడిన సిమెంట్ ప్యాక్టరీ, ఎయిర్‌పోర్టుకు సంబంధించి కేంద్రంతో చర్చించడం జరిగిందన్నారు. ఇందులో సీవోసీ అధ్యక్షుడు కమల్ కిషోర్‌అగర్వాల్, గంద్రత్ సంతోష్, కొత్తవార్ రాజేశ్వర్, కౌన్సిలర్ బండారి సతీష్, తదతరులు పాల్గొన్నారు.

● ఆయిల్‌పాం పంట సాగుపై దృష్టి సారించండి

తలమడుగు: రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్‌పాం పంటల సాగుపై దృష్టి సారించాలని కలెక్టర్ రాజర్షిషా కోరారు. శుక్రవారం మండలంలోని బరంపూర్‌లో ఏర్పాటు చేసిన ఆయిల్‌పాంను సందర్శించి మొక్కలను పరిశీలించారు. ఆయిల్‌పాం నర్సరీలలో 3లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయని, ఇంకా 15వేల మొక్కలు నాటడం జరిగిందని, ఈయేడు జిల్లా లక్ష్యం 2100 ఎకరాలు టార్గెట్ ఉందని, అందులో 1500 ఎకరాలలో రైతులను గుర్తించడం జరిగిందని, మొక్కలు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. రైతులు ఈ ఆయిల్‌పాం మొక్కలను నాటాలని, మొక్కలు ఫిటింగ్ కోసం ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కల్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారి ప్రమోద్, ఆర్టికల్చర్ క్లస్టర్ అధికారి క్రాంతి కుమార్, రైతులు ప్రసన్‌రెడ్డి, వెంకన్న యాదవ్, పంచాయితీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో

విద్యార్థులకు మెరుగైన విద్యనందించండి

● ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త

నార్నూర్, ఆగస్టు 30: ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త ఉపాధ్యాయులను ఆదేశించారు. నార్నూర్ మండలంలోని నాగల్కొండలో గల టీడబ్ల్యుపీఎస్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పీవో విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టార్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతి రోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని అన్నారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే టీడబ్ల్యుపీఎస్ పాఠశాలలో భోజనం నాసిరకంగా ఉండడం వల్ల అక్కడి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఏటీడీవోకు ఆదేశించారు. అలాగే అంగన్‌వాడీ సెంటర్‌లో కూడా మెనూ ప్రకారం భోజనం పాటించనందున అక్కడి సిబ్బంది శాంతాబాయిపై చర్యలు తీసుకోవాలని సీడీపీవోకు సూచించారు. వర్షాల నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో వర్షపు నీరు నిలువకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాల కోసం కృషి చేయాలి

తాంసి, ఆగస్టు 30: పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో ప్రణీత అన్నారు. శుక్రవారం సాయంత్రం తాంసి మండలం పొన్నారి జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులను పలు సామర్థ్యాలపై ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు వారి వారి విధులను బాధ్యతగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేలా కృషి చేయాలని అన్నారు. ఆమె వెంట హెచ్‌ఎం రాజాశంకర్‌తో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

తీజ్ ఉత్సవం లంబాడా సంస్కృతికి ప్రతీక

● విద్యార్థులతో కలిసి నృత్యాలు చేసిన ఎమ్మెల్యే అనిల్

నేరడిగొండ, ఆగస్టు 30: తీజ్ ఉత్సవాలు లంబాడాల సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతికగా నిలుస్తాయని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేజీబీవీ లఖంపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన తీజ్ పండుగ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులతో కలిసి కేజీబీవీలో నృత్యాలు చేశారు. పెళ్లి కాని యువతులు మహిళలు గోధుమ మొళకలు ఉన్న బుట్టలను తలపై పెట్టుకుని పాటలు పాడుతూ నృత్యాలు చేయగా.. ఎమ్మెల్యే వారితో కలిసి నృత్యాలు చేశారు. తీజ్ ఉత్సవాలు జరుపుకోవడం ఆనందంగా ఉందని, భావితరాలు మరిచిపోకుండా ఉండేందుకు ఈ పండుగలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఇందులో రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, ప్రీతంరెడ్డి, కృష్ణారెడ్డి, శిరీష్‌రెడ్డి, శివారెడ్డి, నానక్‌సింగ్, సురేందర్, ప్రతాప్‌సింగ్, గణేష్, కేజీబీవీ ఎస్‌వో రజిత, తదితరులున్నారు.



నృత్యాలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

● రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

నేరడిగొండ: రూ.2లక్షలు రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి కొంత మంది రైతులకు మాత్రమే మాఫీ చేసి మిగత రైతులను మోసం చేశారని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తన నివాసంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఇచ్చోడ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ జావెద్ బీఆర్‌ఎస్‌లో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఇచ్చోడ నేరడిగొండ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.